# 10. ఫలించిన ప్రేమ

ప్రతి మనిషిలోనూ కొంత ప్రతిభ ఉంటుంది. దాన్ని వెలికితీయడానికి సరియైన ప్రోత్సాహం ప్రేరణ కావాలి. ఆనంద్‌లోని పిరికితనం, అమాయకత్వం పటాపంచలై కన్న తల్లిదండ్రులను, అర్థంలేని విద్వేషాలను, కుటిల ఆచారాలను కాలదన్ని సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడానికి ప్రేరణ సుమ. ప్రోత్సాహం నేను. అమాయకంగా లోకజ్ఞానం లేనివాడుగా కనపడుతూ బుద్ధు- అని పిలవబడే ఆనంద్, అంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంటాడని నేనూహించలేదు. బుద్ధావతారమైన నా ప్రియమిత్రుడి ప్రేమ కథ సుఖాంతమైనందుకు నేను సంతోషించాను అనడంకంటే ఆనందసాగరంలో ఓలలాడాను అనటం బాగుంటుంది. ఖళిరా ఆనంద్ నీవనుకున్నది సాధించిన నీకు నా జోహార్లు. మాటలను ఆచరణలో పెట్టి చూపించిన నీవు నిజంగా హీరోవే. వేదికలెక్కి ఉపన్యాసాలు దంచే నాయకమన్యులు నీ కాలి గోటికిందికైనా పనికొస్తారా? మాటలే తప్ప చేతలు చాతకాని ప్రబుద్ధులు నీముందు తలవంచవలసిందే. నిన్ను బుద్ధు అని గేలిచేసిన జనమే నిజంగా బుద్ధుగాళ్ళు. నీలాంటి మిత్రుడున్నందుకు నా కెంతో గర్వకారణం." ఆనంద్ ప్రేమకథ నీవిధంగా నాలో నేను పొగడుకుంటూ ఉన్న నాకు అతని గత జీవితం జ్ఞాపకం రాసాగింది.

ఆనంద్ నాకు చిన్నప్పటినుంచీ క్లాస్‌మెట్. అమాయ

కంగా కనిపిస్తూ ఎవరి జోలికిపోకుండా తన పనేదో తాను చేసుకుంటూ పోయెవాడు. నా ఒక్కనితోనే అతడు అన్ని విషయాలు విడమర్చి చెప్పేవాడు. అతనికి నాకంటే రెండు క్లాసులు తక్కువైన సుమ అంటే ఎంతో ఇష్టం- ప్రేమ. కాని సుమ, ఆనంద్ తల్లిదండ్రులమధ్య పచ్చగడ్డివేస్తే భగ్గు నమండేంత పగ. ఆ పగ ఆ పసివాళ్ళిద్దరి మధ్య ఏమాత్రం ప్రభావం కలిగించలేదు. సుమనుచూస్తే ఆనంద్‌కు, ఆనంద్ నుచూస్తే సుమకు ఒక అపురూపమైన వస్తువును చూసినట్లు గా తోచేది. ఒకరినొకరు రోజు కొకసారైనా కలువందే ఉండే వారుకారు. కలసి ఆడుకునేవారు. ఒకరింట్లో చేసిన టిఫెన్‌లు గారెలు, చకినాలు మొదలైనవి ఏదోవిధంగా ఇంకొకరికి చేర వేసేవారు. ఇద్దరు కలిసి తినేవారు. ఒకరితో ఒకరు అప్పుడ ప్పుడు పోట్లాడుకునేవారు. ఒకరిపై ఒకరు అలిగేవారు. మళ్ళీ అరగంటైనా కాకముందే మాట్లాడుకునేవారు. అప్పు డప్పుడు వాళ్ళిద్దరి మధ్య నేను రాజీ కుదిర్చేవాన్ని. వాళ్ళి ద్దరిమధ్య స్నేహం పెద్దల పరోక్షంలోనే. పెద్దలు వీళ్లు కలిసి ఉండటం చూస్తే చివాట్లు పెట్టేవారు. ఒక్కోసారి కొట్టే వారుకూడ. అప్పుడప్పుడు పిల్లలుకదా అని చూసీచూడన ట్టూర్కొనేవారు. పసితనంలోని వాళ్ళిద్దరి మధ్య స్నేహం వయసు వస్తున్నకొద్ది ప్రేమగా అంకురించసాగింది.

కొంత వయసు వచ్చిన తరువాతకూడా వాళ్లిద్దరూ స్నేహంగా ఉండటంచూసిన ఆనంద్ తల్లిదండ్రు లాతనిని

ఆమెతో స్నేహం మానుకొమ్మని కొట్టారు. తండ్రి అంటే ఆనంద్‌కు భయం. తండ్రిముందు సరేనని అనేవాడు. కాని సుమను చూడందే అతడుండేవాడు కాడు. పాఠశాలలో, ఆటల సమయంలో వాళ్ళు కలుసుకునేవారు. నేను వాళ్ళిద్దరు కలుసుకోవడానికి అప్పుడప్పుడు సహాయంచేసేవాన్ని. ఆనంద్ ఇంటర్‌లో పక్కవూళ్ళోవున్న జూనియర్ కాలేజీలోచేరాడు. సుమ తొమ్మిదవ క్లాస్‌కొచ్చింది. నేనుకూడా ఆనంద్ క్లాస్‌లో చేరాను.

ఆనంద్ ఇంటర్‌లో ఉండగానే ఒక ప్రభుత్వ ఫ్యాక్టరీలో ట్రెయినీగా ఆర్డరొచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో ట్రెయినింగ్. సుమ- ఆనంద్ యు. పి. పోతున్నప్పుడు ఎంతో దుఃఖించింది. మళ్ళీ ఎప్పుడొస్తావని కన్నీటితో ప్రశ్నించింది. యు. పి. లో ఉన్నప్పుడాతడు సుమ మిత్రురాలి అడ్రెస్‌కు వారానికో ఉత్తరం వ్రాసేవాడు. మొదట కుశలప్రశ్నలతో మొదలయిన ఉత్తరాలు క్రమంగా ప్రేమలేఖలుగా మారినయి. ఒకరి ఉత్తరం కొరకు ఒకరు ఎదురుతెన్నులు చూచేవారు. ఒకరోజు లేఖ ఆలస్యమయితే తపించేవారు. ఆనంద్ అప్పుడప్పుడు ఊరికొచ్చినపుడు తన ట్రెయినింగ్‌లో ఇచ్చే డబ్బులోంచే కొంత మిగుల్చుకొని సుమకొరకేదైనా వస్తువు కొనుక్కొచ్చేవాడు.

ఆనంద్ ట్రెయినింగ్ పూర్తయ్యేసరికి పందొమ్మిదేళ్లు నిండాయి. సుమ అందాలనుచిందే పదిహేడేళ్ళ ప్రాయంలో

అడుగు పెట్టింది ఏడవ తరగతితోనే ఆమె చదువు మాన్పిం చారు. ట్రెయినిగ్ పూర్తయినతర్వాత ఇంటికొచ్చిన ఆనంద్ ఆమెను కలుసుకోవాలని, కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకోవాలని, ఎన్నెన్నో మాట్లాడుకోవాలని ఉవ్విళ్లూరసాగాడు. కాని తరచుగా ఆమెను కలిసి మాట్లాడటానికి చిన్నతనంలోవలె వీలయ్యేదికాదు. సుమ స్నేహితురాలి సాయంతో ఆమె ఇంటిలో కలుసుకునేవాడు ఎన్నో ముచ్చట్లాడుకునేవారు. ఒకనాడానంద్ సుమతో 'అమ్మాయిగారిలో కొత్త అందాలు దోబూచులాడుతున్నాయి. ఇన్నాళ్ళుగా ఇవన్నీ ఎక్కడ దాచారో' అన్నాడు. 'ఛీ పో- నీతో మాట్లాడను-' అని బుంగమూతి పెట్టింది సుమ. సుమ బుగ్గపై చిటికెవేసి 'అమ్మాయిగారి కప్పుడే అంత కోపమా?' అని దగ్గరకు తీసుకోబోయాడు. కాని సుమ పూర్వపుమాదిరిగా దగ్గరకురాలేదు. అతన్ని తప్పించుకొని దూరం జరిగింది. 'ఆనంద్, మనమిప్పుడు పిల్లలం కాదు; హద్దుల్లో ఉండడం మంచిది' అని ఆరిందాలా చెప్పింది.

'నేనేం హద్దులు దాటానబ్బా! ఐనా ఎప్పుడబ్బా నీవు పెద్దమనిషివయ్యింది?' అన్నాడు చిలిపిగా ఆనంద్.

'ఛీ! అన్నీసిగ్గులేనిమాటలే. అసలువిషయమైతే దాటేస్తావు'

'సిగ్గు చిన్నప్పుడే పోయిందిగదా! ఏంటిదబ్బా అసలు విషయం_ శోభనమా?' అన్నాడు కొంటెగా ఆనంద్.

"పెళ్ళికాకముందు ఇలాంటి విషయాలు మాట్లాడితే ఛస్తే నీతో మాట్లాడను-' అని బుంగమూతి పెట్టింది సుమ.

'ఐతే పెళ్ళయిన తర్వాత ఫరవాలేదన్నమాట' మరింత ఉడికించాడు ఆనంద్.

"అబ్బబ్బ! నోరు విప్పితే బూతు. నేను వెళ్ళిపోతు న్నాను" అని లేచింది.

అబ్బో! అమ్మాయిగారి కంత కోపమైతే ఈ దాసుడు బ్రతుకడం అబద్ధం. కరుణించండి- కరుణించండి" అని నాటక భంగిమలో ఆమెముందు రెండు చేతులు జోడించి నిలుచు న్నాడు. అతడు నిలుచున్న పైనాన్ని చూసి ఫక్కున నవ్వింది సుమ. అప్పుడానంద్ చేతులు విడిలించి 'ఇప్పుడు చెప్పు అసలు విషయమేమిటో" అన్నాడు.

"నువ్వెప్పుడూ కబుర్లతోనే కాలం గడుపుతావు కాని మన పెళ్ళివిషయ మెప్పుడైనా ఆలోచించావా? అటు మీ అమ్మానాన్నలు, ఇటు మా తల్లిదండ్రులు ఒకరిపై ఒకరు కారాలు మిరియాలు నూరుకుంటూ మనల విడదీయటానికి ప్రయత్నిస్తున్నారు. నువ్వేమో అన్నీ తేలిగ్గా తీసుకుంటూ కాలం గడుపుతావు" అన్నది సుమ.

ఆమె మాటలు విన్న ఆనంద్ సీరియస్‌గా మారాడు. తమ పెళ్ళికి తల్లిదండ్రులు ఒప్పుకోరని తెలుసు అయినా ప్రయత్నించాలనుకొన్నాడు.

"అవును సుమా! నీవన్నమాట నిజమే. మా అమ్మా నాన్నలతో మాట్లాడి ఎలాగైనా వాళ్ళనొప్పిస్తాను. మీవా ళ్ళను ఒప్పించే బాధ్యత నీది" అన్నాడానంద్. అప్పటికి విడి

పోయారిద్దరు. తర్వాత ఆనంద్ నన్ను కలిసాడు నా సలహా అడిగాడు.

"ఆనంద్, మొదట నీవు డ్యూటీలో చేరితే డబ్బు విషయంలో స్వతంత్రుడవౌతావు. అటు తర్వాత అమ్మానాన్నల నొప్పించే ప్రయత్నం చెయ్యి. ఒప్పుకున్నారా సరే; లేదా దగ్గరుండి నేను జరిపిస్తాను మీ పెళ్ళి ఎవరూ మీ పెళ్ళి నాపలేరు- భయపడకు" అని ధైర్యం చెప్పాను.

ఆనంద్ ఉద్యోగంలో జాయినయ్యాడు. కొంత కాలం గడిచింది. ఇంటికొచ్చినప్పుడు ఆనంద్, సుమ కలుసుకున్నారు. "ఆనంద్ నాకేదో భయంగా ఉంది. మా అమ్మానాన్నలతో మన విషయం కదిపాను. నా మాట వింటూనే వాళ్ళు అగ్గిలో గుగ్గిలమయ్యారు. నీతో పెళ్ళి ప్రసక్తే ఎత్తవద్దంటున్నారు. ఆగర్భ శత్రువు కుటుంబంతో సంబంధం ఎట్టి పరిస్థితులలోనూ కుదురదన్నారు. నాకు వేరే పెళ్ళి సంబంధాలు కూడా చూస్తున్నారు. ఇన్నాళ్లు ఎలాగో గెంటుకొచ్చాను. ఏంచేయాలో తోచడంలేదు" అన్నది దిగులుగా.

"అవును సుమా! పెద్దవాళ్ళు తమ మూర్ఖపు పట్టుదలలతో మన ప్రేమను బలితీసుకోవాలనుకుంటున్నారు. మా అమ్మానాన్నలుకూడా ఈ పెళ్ళికొప్పుకోవడంలేదు" అన్నాడానంద్.

"ఆనంద్, మనిద్దరి పెళ్ళికావడం అసంభవమేనంటావా?"

"లేదు సుమా! లేదు. ఆరునూరైనా, నూరు ఆరైనా ఎట్టి

విపత్కర పరిస్థితులెదురైనా నిన్ను పెండ్లాడి తీరుతాను. నీ కొరకైనా ఆస్తిని, బంధువులనుకూడా తృణప్రాయంగా వదిలిపెడ్తాను. ఏశక్తులూ మనలను విడదీయలేవు. నీవు బెంగ పడకు" అని ఆమెకు ధైర్యం చెప్పి నావద్ద కొచ్చాడానంద్. నన్ను సలహా అడిగాడు. చివరిసారిగా తండ్రి నడిగి చూడ మన్నాను. ఒప్పుకోకుంటే తర్వాత ఆలోచిద్దామని చెప్పాను.

తండ్రి సంతోషంగా ఉన్న సమయంచూసి తండ్రితో ఆనంద్ 'నాన్నా మీనిర్ణయం మారదా!' అన్నాడు. ఆనంద్ మాటలు వింటూనే తండ్రి ముఖంలో సంతోషం మాయమ యింది. "ముమ్మాటికి మారదు. ఆగర్భ శత్రువు కూతురును నా యింటి కోడలుగా అంగీకరించను" అన్నాడు కోపంగా.

"నాన్నా! మీ పెద్దవాళ్ళ కక్షలకు, పగలకు మా ప్రేమలు బలికావల్సిందేనా?"

'పిచ్చిమట బోడి ప్రేమ. లోకమంటే తెలియని నీకు ప్రేమకావల్సి వచ్చిందా? నీ బాగోగులు నాకు తెలుసు. నోరు మూసికొని పడివుండు.'

మెత్తగా మాట్లాడితే లాభంలేదు. నాన్న మరింత రెచ్చి పోతున్నాడు. ఏమైనా సరే, అటో ఇటో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నాడానంద్. 'నాన్నా! నేను సుమను తప్ప వేరెవరినీ పెండ్లాడను' అన్నాడు దృఢంగా.

'అదే నీ చివరినిర్ణయమైతే నా ఆస్తిలో చిల్లిగవ్వ కూడా నీకు చెందడానికి వీలులేదు.'

'సరే నాన్నా! మీ ఆస్తులు, అంతస్థులు కక్షలకొరకు నా ప్రేమను బలిచేసుకోలేను. నేను సుమను పెళ్లాడితీరుతాను.'

'ఈ పెళ్ళెలా జరుగుతుందో నేనూ చూస్తాను. పోలీసు రిపోర్టిచ్చి మిమ్మల అరెస్టు చేయిస్తాను' అని బెదరించాడానంద్ తండ్రి. కొంచెం భయపడ్డాడతను. ఇదిలా జరుగుతుందని తెలిసి వాళ్లు మేజర్స్ అన్న విషయం అంతకు ముందే చెప్పానానంద్‌కు.

'మేమిద్దరమూ మేజర్లము. ఇష్టపూర్వకంగా పెళ్ళిచేసుకుంటున్నామని స్టేట్‌మెంటిస్తే మీ పరువేమౌతుంది?' అన్నాడు కొంచెం భయపడుతూనే ఆనంద్ తండ్రితో.

'గుడ్డొచ్చి తల్లి నెక్కిరించినట్టు నాకే నీతులు చెప్తున్నావా? ఈ పెళ్ళి నెలా విఘ్నంచేయాలో నాకు తెలుసు' అని హుంకరించాడు ఆనంద్ తండ్రి.

తండ్రితో చివాట్లు తిని నాదగ్గరకొచ్చాడానంద్. విషయమంతా చెప్పాడు. ఏంచేయాలో తోచక నా సలహా నడిగాడు. ఎలాగైనాసరే అమాయకులైన ప్రేమికులను పెద్దల కక్షలకు, పట్టుదలకు బలిచేయకూడదు. వీళ్ళిద్దరి నెలాగైనా కలపాలి. నా ముద్దుల బుద్ధ ఫ్రెండుయొక్క ప్రేమగాథను సుఖాంతం చేయాలి అని నిర్ణయించుకొన్నాను. వాళ్ళిద్దరు రహస్యంగా కలిసే ఏర్పాట్లు చేసాను. ఎన్ని ఒడుదుడుకు లెదురైనా వెనుకంజ వేయరాదనీ మాట తీసుకున్నాను. వాళ్ళిద్దరి దృఢనిర్ణయానికి ముగ్ధున్నయ్యాను. 'ఆనంద్!

మీ మామగారు కొంత మెతక మనిషి. ప్రయత్నించి అత నిచే ఒప్పిస్తాను. అతడొప్పుకున్నా, ఒప్పుకోకపోయినా సిద్దిపేటలో పెళ్ళి ఎర్పాట్లు చేస్తాను. పెళ్లి అయ్యేంతవరకు మీ నాన్నగారికిది తెలియకూడదు. తర్వాత కాలమే కొన్ని సమస్యలకు పరిష్కారం చెపుతుంది. నీవు కరీంనగర్ పోయి మన మిత్రులతో ఈ విషయంగూర్చి మాట్లాడు. ఆదివారం వరకు సిద్దిపేటలో పెళ్లి ఏర్పాట్లు చేస్తాను' అని వాళ్ళను పంపించాను. సుమ తండ్రిదగ్గరకు పోయాను. నమస్కరించి కూర్చున్నాను. "రంగయ్యగారూ, ఆనంద్- సుమలను ఆశీ ర్వదించండి. మీ పగలకు అమాయకుల ప్రేమలను బలి తీసుకోకండి" అన్నాను.

"పగవాడి కొడుకుతో నా కూతురుపెళ్ళా? ఇది కాని పని" అన్నాడు రంగయ్యగారు కోపంగా.

"ఆనంద్ తండ్రి పగవాడు కావచ్చు కాని ఆనంద్ కాదు గదా! పసితనంనుండి ఒకరిపై ఒకరికున్న అనురాగాన్ని నిర్దాక్షిణ్యంగా నలిపివేయకండి! మీరా అమ్మాయికి బలవం తంగా వేరే పెళ్లిచేసినా మనసొకచోట, మనువొకచోటై జీవితంలో సుఖపడలేదు. తర్వాత ఏ అఘాయిత్యానికైనా పాల్పడవచ్చు- ఆలోచించండి" అన్నాను.

ఐనా రంగయ్యగారిలో మార్పు కలుగలేదు. కొంచెం చలించినట్లనిపించినా దృఢంగానే అన్నాడు-

"ఏదేమైనా నాబిడ్డకు వాడితో పెళ్ళిజరగడం కుదురదు."

"రంగయ్యగారూ! పెద్దలని మిమ్ములను సంప్రదించాను. వాళ్ళిద్దరు పరస్పరం ఇష్టపడ్డారు. పైగా వాళ్లు మైనారిటీ తీరినవాళ్లు. మీ రొప్పుకున్నా, ఒప్పుకోకపోయినా వాళ్ళు పెళ్లి చేసుకోవడానికే నిర్ణయించుకున్నారు. మీ రెన్నిరోజులని వాళ్ళ నాపగలరు? ఆనంద్ తల్లిదండ్రు లెలాగూ ఒప్పకోరు; మీరైనా దగ్గరుండి ఈ పెళ్లి జరిపించి మీ గౌరవం కాపాడుకోండి. అమ్మాయి సుఖాన్ని కోరేవారైతే దీనికొప్పుకోండి" అన్నాను కటువుగా.

నా మాటలకు కొంచెం జంకినట్టుగా కనపడ్డాడాతడు.

'ఇష్టపడని అత్తమామలతో నాకూతురెలా సుఖపడ్తుంది? వాళ్ళామెను రాచి రంపాన పెట్టరా ?'

"ఆనంద్‌కు ఉద్యోగముంది. పరిస్థితులు చక్కబడేంత వరకు వాళ్లు అక్కన్నే ఉంటారు. అయినా పెద్దలు కుదిర్చిన కాపురాల్లో ఎన్ని కాపురాలు అత్తమామల పోరు లేకుండా కలతలు లేకుండా సాగిపోతున్నాయో చెప్పండి" అన్నాను.

రంగయ్యగారు కొంచెం మెత్తబడ్డారు. అదే సమయమని అతనికి అనేక విధాలుగా నచ్చజెప్పాను. తుదకాతడు ఒప్పుకున్నాడు. కరీంనగర్ నుండి తిరిగివచ్చిన ఆనంద్ "శేఖర్! చూసావా మా నాన్నగారెంత నీచానికి దిగజారారో. కరీంనగర్‌లో గూండాలతో నన్ను బెదిరించజూసాడు. నేను కొంచెం భయపడ్డా ధైర్యంగానే జవాబిచ్చాను. నేను చేసేదాంట్లో తప్పులేనపుడు ఎవరికీ భయపడాల్సింది లేద

న్నాను. మీ యిష్టమున్న పని చేసుకోండి. నేనా అమ్మాయిని పెళ్ళాడి తీరుతానని చెప్పాను" అన్నాడు.

"ఆనంద్, నీ ధైర్య సాహసాలకు నా ధన్యవాదములు. ఆదివారం పెళ్ళన్న సంగతి రహస్యంగా ఉంచు. ముఖ్యంగా మీ నాన్నగారికి తెలియకూడదు" అని చెప్పాను.

నలుగురైదుగురం మిత్రులం కలిసాం. పకడ్బందీగా ప్లాను వేశాము. శనివారం సాయంత్రం అందరం సిద్దిపేట చేరుకున్నాము. ఒకవేళ మా ప్లాను లీకయి ఆనంద్ తండ్రి ఏ అఘాయిత్యమైనా చేస్తాడని పోలీసు సహాయం తీసుకున్నాము. పెళ్లి ఏర్పాట్లు జరిగిపోయాయి. పెళ్లి సమయానికి నానా హడావిడిచేస్తూ కరీంనగర్ నుండి గూండాలొచ్చారు. పోలీసులు వాళ్ళందరినీ అరెస్టుచేసారు. పెళ్లి జరిగింది. ఆనంద్, సుమ అన్యోన్యంగానే కాపురం చేసుకుంటున్నారు. కాని ఆనంద్ తండ్రిలో నాలుగేళ్లు గడిచినా మార్పు లేదు. నా మిత్రుడి సుఖాంత ప్రేమగాథనుగూర్చి ఆలోచించుకుంటున్న నేను 'పోస్టు' అన్న కేకకు ఈ లోకంలోకి వచ్చి పడ్డాను. కవర్ చింపి ఉత్తరం చదివాను.

ప్రియ మిత్రుడు శేఖర్‌కు—

నమస్కారములు.

నీవంటుండేవాడివి- పరిస్థితులే కొన్ని సమస్యలకు పరిష్కారాలు చూపిస్తాయని. నాన్నగారు ఉత్తరం వ్రాసారు. తన పరిస్థితి బాగాలేదని, వృద్ధాప్యంలో కొడుకు సహాయం

కావాలని. నా పెళ్ళికి అన్ని విఘ్నాలు కలిగించి కత్రువుగా ప్రవర్తించిన నాన్నకు నేను సహాయంచేయాలా? నాలుగేళ్ళుగా గుర్తులేని నేనిపుడు గుర్తుకొచ్చానా? ఒకదిక్కు కన్న తండ్రిపై ప్రేమ, మరొకవైపు పట్టుదల. ఏంచేయాలో తోచడంలేదు. నాప్రేమ వివాహం విజయవంతమైనందుకు సంతోషంగానే ఉన్నా, నా మిత్రుడు 'రమణ' పరిస్థితిచూస్తే భయమేస్తుంది. మొదలెంతో అన్యోన్యంగా ఉన్న రమణ దంపతులు ఇప్పుడు రోజూ కొట్లాటలతో ఇల్లును కురుక్షేత్రంగా మార్చారు. అటు అయినవాళ్ళకు దూరమై, ఇటు ఒకరికొకరు దూరమై జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నారు. వీళ్ళ కాపురాన్నిచూస్తే ఒక్కొక్కరి విషయంలో ప్రేమ పెళ్ళిళ్ళు ఎంత భయంకరంగా ఉంటాయోననిపిస్తుంది. వీళ్ళ ప్రేమ విఫలమవడానికి కారణం తెలియడంలేదు. నీనుండి లేఖకై ఎదిరి చూస్తాను—

నీ మిత్రుడు
ఆనంద్.

ఈ లేఖను ఆమూలాగ్రంగా చదివిన నేను కలం తీసుకున్నాను. అప్పుడే అతనికి జవాబు వ్రాసాను.

ప్రియ మిత్రుడు, ఆనంద్‌కు
నమస్కారములు.

ఎంత అమానుషంగా ప్రవర్తించినా వృద్ధాప్యంలో ఉన్న నీ తల్లిదండ్రుల నాదుకొనుట నీ కర్తవ్యం. పాత విషయాలను మరచిపోయి వాళ్ళకు సహాయంచేయి. సరియైన

అవగాహన లేక మూర్ఖంగా ప్రవర్తించినా వాళ్ళు నిన్ను కనిపెంచినవాళ్ళు. వాళ్ళను పోషించుట నీ బాధ్యత. ప్రేమ పెళ్ళిళ్ళు సఫలమవడానికి ఒకరినొకరు పరస్పరం అర్థం చేసుకోవడం, ఆర్థిక స్వాతంత్ర్యం కారణాలౌతాయి. నీ పెళ్ళి విజయవంత మవడానికి ముఖ్యంగా నీవు ఆర్థికంగా సర్వస్వతంత్రుడవవడమే కారణం. ఏ ఉద్యోగం లేకున్నా, వేరే ఆదాయం లేకున్నా రమణ పెళ్ళిచేసుకున్నాడు. ఇద్దరివద్ద ఉన్న డబ్బయిపోయేంతవరకు అన్యోన్యంగానే ఉన్నారు. తర్వాత ఏం చేస్తారు, ప్రేమను తిని బ్రతుకలేరుకదా! ఇటు ఉద్యోగంలేదు. ఇక వాళ్ల కాపురా లెలా నిలుస్తాయి? పెళ్ళి విఫలానికి పరిస్థితికూడా కారణమౌతుంది. రమణనుచూచి అన్ని పెళ్ళిళ్లిలాగే ఉంటాయనుకోరాదు. సరిగా ఆలోచించి తమను తాము పోషించుకునే స్థితిలో ఉంటే ఇది తప్పకుండా విజయవంతం ఔతాయి. వీటివల్ల సంఘాన్ని పీడిస్తున్న వరకట్న దురాచారం, కులమత విభేదాలనుకూడా కొంత వరకు నిర్లక్ష్యం చేయవచ్చు.

మీ మిత్రుడు,
శేఖర్.

(అరుణరేఖ- డిసంబర్ 83)

# 11. మేడిపండు

అది ఆంధ్రదేశంలోని పల్లె, పట్నంకాని ఒక కాలనీ. పేరు సమతానగర్. దేశంలోనున్న వంట నూనెల కొరత